క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



జాన్‌వెస్లీకి చిత్రపటం అందజేస్తున్న చెన్నా జానకీరామ్, తదితరులు

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని 37వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్థాయి సంఘం మాజీ సభ్యుడు చెన్నా జానకీరామ్ శుక్రవారం పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీని మర్యాద పూర్వకంగా కలిసి యేసుప్రభు చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నా మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్ వెస్లీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. జాన్‌వెస్లీని వార్డు నాయకులు ఆకుల యేసు, కె.ఎల్లాజీ, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు కలిశారు.

20న వాహనాల వేలం

డాబాగార్డెన్స్ : వన్‌టౌన్ క్రైమ్ పోలీసు స్టేషన్ స్వాధీనంలో ఉన్న 3 అబాండెడ్ మోటార్ సైకిళ్ల(స్క్రాప్)ను ఈ నెల 20న బహిరంగ వేలం వేయనున్నట్టు వన్‌టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఆ వాహనాల యజమానులు, సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్ చేయని కారణంగా, మహారాణిపేట తహసీల్దార్ ఉత్తర్వుల మేరకు 20న ఉదయం 11 గంటలకు కొమ్మాది జంక్షన్ సమీపంలోని వెహికల్స్ డంపింగ్ యార్డ్ వద్ద వేలం వేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440904310, 9491801354లో సంప్రదించాలని సూచించారు.

క్యాన్సర్, సీపీఆర్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అల్లిపురం : క్యాన్సర్ అండ్ సీపీఆర్‌పై డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. నివారణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ నవ్య పాల్గొని క్యాన్సర్ రావడానికి గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రస్తుత రోజుల్లో చాలా మంది క్యాన్సర్ బారినపడి అవగాహన లేక చనిపోతున్నారని వివరించారు. అదేవిధంగా క్యాన్సర్ రాకుండా వాక్సిన్ వేసుకోవాలని సూచించారు. నివారణ ట్రస్ట్ ఫౌండర్ సత్య సీపీఆర్ చేసే విధానం ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను ఏ విధంగా కాపాడాలో తెలియజేశారు. అదేవిధంగా అమ్మాయిలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై వివరించారు. కార్యక్రమంలో అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీ నాగభూషణం, పీఈటీ మాస్టర్ ఎం.రవి, సీనియర్ అసిస్టెంట్ అడబాల శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అనఘాలక్ష్మి వ్రతం



విశేష అలంకరణలో రాజశ్యామల, వారాహి సహిత అనఘాలక్ష్మిదేవి

అల్లిపురం : వివేకానందకాలనీలోని అనఘాలక్ష్మి, వారాహి, రాజాశ్యామల సహిత షిరిడీ సాయి దర్బారులో శనివారం అనఘాలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. జయలక్ష్మి మాతా మాతృమండలి, చింతామణి గణపతి దత్త క్షేత్రం, సాయిమేరు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే వ్రతంలో దాదాపు 300 మంది పాల్గొంటారని తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే వారు నేరుగా పూజా సామగ్రితోపాటు అరివేణం, పంచపాత్ర, ఉద్ధరిణి, ఒక వాటర్ బాటిల్, పువ్వులు, ఒక న్యూస్ పేపరు పట్టుకుని రావాలని సూచించారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి వ్రతం ప్రారంభమవుతుందన్నారు. గత రెండు రోజులుగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పూలసందు వీధిలో శిథిలమైన కాలువ



నూనె మిల్లు వీధిలో రహదారి వరకూ నిర్మించి... వదిలేసిన కాలువ ఇదే

మురుగు నిల్వలతో వ్యాధుల భయం



ప్రసాద్‌గార్డెన్స్‌లో కాలువ దుస్థితి ఇదీ...

- పాతనగరంలో శిథిలావస్థలో కాలువలు
- సంవత్సరాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- అటువైపు కన్నెత్తి చూడని జీవీఎంసీ ఉన్నతాధికారులు

జగదాంబ :

పాతనగరంలో మురుగు కాలువల సమస్య ఆ ప్రాంతీయులను పట్టిపీడిస్తోంది. ఘన చరిత్ర కలిగిన పాతననగంలో ఇప్పుడు గ్రేటర్ విశాఖ మున్సిపాలటీ... ఒకప్పుడు మున్సిపాలిటీగా ఉన్నప్పుడు వీధుల్లో కాలువలు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటికీ అవే కాలువలు వినియోగించాల్సి దుస్థితి నెలకొంది. ముఖ్యంగా జీవీఎంసీ 35వ వార్డులో పరిస్థితి దారుణంగా ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 22 వేలు మంది నివసిస్తున్నారు. ఫలితంగా వార్డు పరిధిలోని పూర్ణా మార్కెట్, పండావీధి, లక్ష్మీనగర్, ఆర్ఆర్ఎంఆర్ రోడ్డు, వెలంపేట, పండావీధి, ప్రసాద్ గార్డెన్స్, దుర్గమాంబ సమాజం, కల్లుపాకలు, స్ప్రింగ్‌రోడ్డు, అరటి పండ్లు వీధి, పువ్వుల వీధి, గాజుల వీధి, నూనెమిల్లు వీధి, టౌన్ కొత్తరోడ్డు, రామకృష్ణ రోడ్డులో కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. వీధుల్లో సిమెంట్ గట్లు విరిగిపోయి నీరు నిలిచిపోతోంది. ఫలితంగా దోమలు పెరిగిపోయి స్వైర విహారం చేస్తున్నాయి. జ్వరాలు, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని వాపోతున్నారు. కనీసం వారానికి ఒక్కసారి కూడా మురుగు కాలువల్లో బ్లీచింగ్ వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా విభాగం సిబ్బంది ఎపిడిమిక్ సీజన్‌లో తప్ప వార్డుల్లో ఎక్కడా కానరావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్లు జరగకపోవడంతో దోమలు మరింతగా వృద్ధి చెందుతున్నాయని భయపడుతున్నారు.

పాతనగరమంటేనే వివక్ష..!

ముందు వచ్చిన చెవులు కంటే వెనుక వచ్చిన కొమ్ములు మిన్న అన్న చందంగా పాత నగరంపై అధికారులు వివక్ష చూపుతున్నారని ఆ ప్రాంతీయులు ఆరోపిస్తున్నారు. నగరం విస్తరించిన తర్వాత పాతనగరం అభివృద్ధిని పట్టించుకోవడం మానేశారని... ఇతర ప్రాంతాల్లో మాత్రం సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక రోడ్లు, డ్రైనేజీలు ఇతర ప్రాంతాల్లో నిర్మిస్తున్నారని, మా ప్రాంతాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని వాపోతున్నారు. పాలకులు, అధికారులు ఉండే ప్రాంతాలే అభివృద్ధి చేస్తే మురికివాడల నుంచి కూడా ఎందుకు జీవీఎంసీ సిబ్బంది పన్నులు వసూల్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఎన్నేళ్లు ఈ దుస్థితి అని మండిపడుతున్నారు.

ఆదాయమంతా ఆస్పత్రులకే...



ఏటా ఎపిడిమిక్ సీజన్‌లో వ్యాధులకు గురవుతున్నాం. సంవత్సరం పాటు కష్టపడి సంపాదించుకున్న ఆదాయమంతా ఆస్పత్రుల్లో వైద్యానికి ఖర్చు చేస్తున్నాం. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీధుల్లో మురుగునీటి కాలువలు దోమలకు ఆవాసంగా మారిపోయాయి. ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొంది.

– రమణమ్మ, కల్లుపాకలు

పాలకులు మారుతున్నా చర్యలు శూన్యం



మేము పాతనగరంలోనే పుట్టాం. ఏళ్లుగా మురుగు కాలువల మధ్య జీవిస్తున్నాం. పాలకులు, అధికారులు మారినా మా వన్‌టౌన్ మాత్రం మారడం లేదు. ఎప్పుడో నిర్మించిన మురుగు కాలువలు శిథిలమైపోయినా ఎవరూ పట్టించుకోవడ లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కొత్త కాలువలు నిర్మించాలి.

– సత్యనారాయణ, వెలంపేట

ఉన్నతాధికారులు పర్యటించాలి



జీవీఎంసీ సిబ్బంది రహదారులు పరిశుభ్రం చేస్తే సరిపోతుందా..? వీధులు కూడా పరిశుభ్రం చేయాలి కదా. ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా వార్డుల్లోని అన్ని వీధుల్లోనూ పర్యటించాలి. అప్పుడే సమస్యలు గుర్తించి పరిష్కరించవచ్చు. మా ప్రాంతంలో మురుగు నిల్వతో అనారోగ్యానికి గురవుతున్నాం.

– సూరిబాబు, అరటిపండ్లు సందు

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ



దుప్పటి అందజేస్తున్న పచ్చిరిపల్లి రాము, పీవీఎన్ రెడ్డి

అల్లిపురం : అల్లిపురం అమ్మవారి వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము పేదలను ఆదుకునేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి పీవీఎన్ రెడ్డితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్ దరి డాక్టర్ వైఎస్సార్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌పై చలిలో నిద్రపోతున్న వారికి దుప్పట్లు అందజేశారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.

వేదిక్ మ్యాథ్స్ ఉపయోగకరం

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం హ్యూమన్ వేల్యూస్, ప్రొఫెషనల్, వేదిక్ మ్యాథమెటిక్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ వేదిక్ మ్యాథమెటిక్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విద్యార్థులు కూడా దీనిని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులందరికీ వేదిక్ మ్యాథమేటిక్స్ ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పీఎల్ శరణ్య, సంజీవ్‌రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



కోడలుతో సంజయ్

సీతమ్మధార: జార్ఖండ్ రాష్ట్రం, పలము జిల్లాలోని బండువ గ్రామానికి చెందిన సంజయ్ (55)ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్నేళ్ల క్రితం భార్యతోపాటు సోదరుడు కాలం చేయడంతో సంజయ్ మానసికంగా కుంగిపోయాడు. అదే సమయంలో కుటుంబ పోషణ కోసం కొడుకుతో కలిసి పనికోసం బయలుదేరాడు. అప్పటికే మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో వైజాగ్‌లో తప్పిపోవడంతో ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో వైద్యం అందించారు. ఇటీవల కోలుకోవడంతో వివరాలు సేకరించి స్వస్థలానికి తీసుకెళ్లి కోడలు సుఖ్నీదేవికి అప్పగించామని సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయం



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయమని, ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకుని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి సంజీవయ్య అందించిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. సబ్బవరంలో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ ఉన్న విషయం మనందరికీ తెలిసిందేనన్నారు. మంచి పరిపాలనా దక్షత కలిగిన నేతగా ప్రసిద్ధిగాంచారని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఇతర అధికారులు సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్రానికి, దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్బీఐ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందజేయండి



సమావేశంలో కమిషన్ సభ్యులు, వైద్యులు

మహారాణిపేట : బిడ్డ పుట్టిన వెంటనే సంబంధిత ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు లేకుండా నేరుగా తల్లిదండ్రులకు అప్పగించేలా కేజీహెచ్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, గొండు సీతారాం, ఆదిలక్ష్మి, త్రివర్ణ ఆదేశాలు జారీ చేశారు. విశాఖ జిల్లా పర్యటనలో ఉన్న కమిషన్ సభ్యులు శుక్రవారం కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.రాధాక్రిష్ణ అధ్యక్షతన సమావేశమయ్యారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పొప్పులు, సవరణలపై చర్చించారు. సర్టిఫికెట్లు అందించేందుకు పిల్లల వార్డుకు అనుసంధానంగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారా..? గత 2024లో జనవరి నుంచి డిసెంబర్ వరకు ఎంతమంది పిల్లలు జన్మించారని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తుల్లో సవరణలు చేశారో ప్రశ్నించారు. పిల్లల వార్డు ప్రాంగణంలోనే డీఎస్‌వో, ఏఎస్‌వో ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల ఆదేశాలు, సూచనలు పాటిస్తామన్నారు. సమావేశంలో కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, చిన్నపిల్లల వైద్య విభాగం అధిపతి డాక్టర్ బి.చక్రవర్తి, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ ధవళ భాస్కర రావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్.గోవింద రావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

కుల గణనతోనే బీసీలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు

సీతంపేట : రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బహిర్గతం చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారత చరిత్రలో బీసీలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కరువైందన్నారు. కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించామన్నారు. కులగణన ద్వారా మనమెంత, మన వాటా ఎంత అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి రాజ్యాధికారం సాధన దిశగా పయనిస్తామని తెలిపారు. బీసీ సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి ఒకే ఎజెండాతో బీసీల హక్కుల సాధన, ప్రాధాన్యత, రాజ్యాధికారం కోసం శ్రమిస్తామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సమన్వయ కమిటీ కన్వీనర్ పెదపెంకి శివప్రసాద్‌కు మద్దతు తెలపాలని సమావేశంలో తీర్మానించారు. అధికార ప్రతినిధి పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో కన్వీనర్ పల్లా వెంకట అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు

బీసీ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా కమిటీని సంఘం చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. కన్వీనర్‌గా పెదపెంకి శివప్రసాద్, అధికార ప్రతినిధిగా పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో కన్వీనర్లుగా సీహెచ్.శ్రీనివాసరావు, కాండ్రేగుల వెంకట ఉమా మహేష్, కొత్తూరు భాస్కరరావు, నూలు అభిరామ్, తమ్మిరెడ్డి మంగతాయారు, భీమరశెట్టి విశ్వనాథం, పల్లా వెంకట అప్పారావు, కొమ్మోజు వెంకట సూర్యం, మహిళా కన్వీనర్‌గా జన్నెల అనుపమ, మహిళా కో కన్వీనర్‌గా పోతాబత్తుల ఆదిలక్ష్మి నియమితులయ్యారు. వీరంతా రాష్ట్ర కమిటీ ఆదేశాలను అనుసరిస్తూ బీసీ సమన్వయ కమిటీని విశాఖ జిల్లాలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రోగులతో సెక్యూరిటీ మర్యాదగా ప్రవర్తించాలి

మహారాణిపేట : వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులపట్ల సెక్యూరిటీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ సూచించారు. ఆస్పత్రిలోని వార్డులను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక సెక్యూరిటీ గార్డు మద్యం సేవించి విధులకు హాజరైనట్లు గుర్తించి విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఆపరేషన్ థియేటర్లో థియేటర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో విచారించి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు, భద్రత కల్పించే విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఎఫ్.ఆర్.ఎస్ అమలు విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

28 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, రైల్వే భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన అనుర్బ సర్కార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, ఆజంగఢ్‌కు చెందిన జె.వర్మ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 28 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

జోన్ - 5లో స్వచ్ఛతా డ్రైవ్



ర్యాలీలో విద్యార్థులు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

కంచరపాలెం : జీవీఎంసీ జోన్ - 5 జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్‌కాలనీలో స్వచ్ఛభారత్ అభియాన్, వాతావరణ అనుకూలతలో భాగంగా శుక్రవారం జోనల్ కమిషనర్ బి.రాము ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ పాల్గొని మాట్లాడారు. కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి చేసే ప్రయత్నమే స్వచ్ఛతా డ్రైవ్ అని తెలిపారు. ఇన్ఫోగ్రాఫిక్ వాల్ ఆర్ట్, పీర్ లెర్నింగ్ సెషన్లు, డిజిటల్ కమ్యూనిటీ మొబిలైజేషన్ వంటి కార్యక్రమాలతో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్లాస్టిక్ వద్దు... జూట్ బ్యాగులే ముద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, డీఈ రామసుబ్బారావు, ఏపీడీ పుణ్యవతి, జనార్ధనరావు, శేఖర్, యోగా టీచర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి విశేషంగా క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ విశేషంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 2566514, 2711725లో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసి దళార్చన నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్, యూబీఐఎన్ 0806091)లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా 8985515989కు వాట్సాప్ చేయాలి.

ఏఆర్ సిబ్బందికి యోగా తరగతులు ప్రారంభం



మొబలేజేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఏఆర్ సిబ్బంది

అల్లిపురం : నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా యోగా, పీటీ, ఆయుధ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని శాంతి భద్రతల డీసీపీ – 2, మేరీ ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి మొబలేజేషన్‌లో భాగంగా 15 రోజులపాటు పీటీ, యోగా, డ్రిల్, ఆయుధ ప్రయోగంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



త్యాగరాజ కీర్తనలు అలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ భక్తులను అలరించింది. విద్యార్థి మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.జగదాంబ ఆధ్వర్యంలో ఆమె శిష్య బృందం సీహెచ్.పల్లవి, వందన, టి.ఉష, ఎస్.సౌగంధి, సహస్ర త్యాగరాజకీర్తనలు అలపించి ప్రేక్షకులను పరవశింపజేశారు. మహా గణపతిం భజేతో ప్రారంభించి, శ్రీసరస్వతి, శ్రీరామ పాదమా, సుధా మాధుర్య, నను గన తల్లీ, బాల త్రిపుర కీర్తనలు ఆలపించారు. వీరికి ఐవటూరి కృష్ణవేణి వయోలిన్‌పై, తాలడ చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు.